సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగోజిగూడ: లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో కలిసి వైత్రినగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ కార్తీక్, డీఈ రవిచంద్ర, ఏఈ విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎల్‌బీనగర్ జడ్పీ పాఠశాలతో పాటు రోడ్డును పరిశీలించారు. పాఠశాల ప్రధాన గేట్ ఎల్‌బీనగర్ ప్రధాన రహదారి వైపు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అందుకే వెనుకవైపు గేట్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు.


రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

‘మందకృష్ణకు క్షమాపణలు చెప్పాల్సిందే’


ధర్నా చేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వీరయ్య

చాదర్‌ఘాట్: దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, వీహెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు మందకృష్ణకు తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేకుంటే డిసెంబర్ 3న నిర్వహించనున్న దివ్యాంగుల దినోత్సవాన్ని అడ్డుకుంటామని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ హెచ్చరించారు. మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ జీఎం ప్రభంజన రావుకు వినతిపత్రం అందించి ధర్నా విరమించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవానీచౌదరి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పంతంగి మంగమ్మ, అందె రాంబాబు, గోపాల్‌రావు, సత్యనారాయణ, కాళ్ల జంగయ్య పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను అగౌరపర్చలేదు

చాదర్‌ఘాట్: మందకృష్ణ మాదిగను తాను అగౌరపర్చలేదని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య స్పష్టం చేశారు. మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. బీజేపీకి మద్దతుదారుగా ఉన్న మందకృష్ణను రాజకీయంగా ప్రశ్నించడం తప్పా..? అని ప్రశ్నించారు. కానీ కొందరు తనను ఉద్దేశపూర్వకంగా దుర్భాషలాడడం దారుణం అని పేర్కొన్నారు. దివ్యాంగుల హక్కులు, సమస్యలపై సంఘటితంగా కృషి చేద్దామని ఆయన కోరారు.

ప్రభుత్వ బాలల సదనం సందర్శన

సైదాబాద్: సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనాన్ని హైకోర్టు జడ్జి భీమపాక నగేశ్ శుక్రవారం సందర్శించారు. ఇటీవల ఆర్చరీ పోటీల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన ఐదుగురి బాలలను అభినందించారు. అలాగే వారికి అవసరమైన సైకిళ్లు, ట్రాక్ సూట్స్‌ను అందించారు. క్రీడల్లో మరింత రాణించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.


బాల క్రీడాకారులతో హైకోర్టు జడ్జి భీమపాక నగేశ్

నూతన వధూవరులకు ఆశీర్వాదం


త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డిని సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

నాగోలు: కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీ సంక్షేమ అధ్యక్షుడు అనంతుల ఉమా సురేందర్‌రెడ్డి రెండో కూతురు జాన్వి వివాహం యశ్వంత్‌రెడ్డితో ఇటీవల జరిగింది. అయితే పెళ్లికి హాజరు కాలేకపోయిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి గురువారం రాత్రి సురేందర్‌రెడ్డి నివాసానికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సన్మానించి వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్తీక వన మహోత్సవ అభినందన సభ

వనస్థలిపురం: వనస్థలిపురం పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తుర్కయాంజాల్ చెరువు కట్ట కింద ఉన్న సంఘం భవనంలో రేపు 34వ కార్తీక వన మహోత్సవ అభినందన సభ–2024ను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు మ్యాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రచ్చ లక్ష్మయ్య తెలిపారు. వనస్థలిపురంలోని శ్రీ శివ మార్కండేయ స్వామి ఆలయంలో అందుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభలో పరిచయాలు, పరిణయ వేదిక, రిటైర్డు ఉద్యోగులకు సత్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల సందేశాలు, ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా ట్రాఫిక్ డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు, పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ రాజ్‌కుమార్, పద్మశ్రీ గజం గోవర్ధన్, హైకోర్టు న్యాయవాది మాచర్ల రంగయ్య, భద్రాచలం పద్మశాలీ అన్నదాన సత్రం చైర్మన్ గోషిక యాదగిరి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్కాల్దేవి మురళి, కొంకతి మహాదేవ్, మారేపల్లి రామచంద్రయ్య, బొమ్మ అరుణ్‌కుమార్, నోముల అశోక్, పుట్టపర్తిని జ్ఞానేశ్వర్, ఆరుగొండ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంక్షేమ సంఘం నాయకులు

అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి

హస్తినాపురం: డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోత్ సుజాతనాయక్ అన్నారు. అధికారులతో కలిసి డివిజన్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న నూతన కాలనీల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి పనులు చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ మల్లికార్జున్‌గౌడ్, పల్లం శ్రీనివాస్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

కార్తీక వన భోజనాల సందడి

చైతన్యపురి: ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపోలో డీఎం సమత ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎంలు సుచరిత, జగన్ హాజరయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి డిపో సిబ్బందితో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఏటి వెంకన్న, ఎంఎఫ్ వెంకటేశ్, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



కేసీఆర్ దీక్షతోనే | తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

- బీఆర్‌ఎస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆజమ్ అలీ

మలక్‌పేట: కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైందని గ్రేటర్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆజం అలీ, మలక్‌పేట ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి పేర్కొన్నారు. దీక్షాదివస్ సందర్భంగా అక్బర్‌బాగ్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో కేసీఆర్ సేవాదళం గ్రేటర్ ఉపాధ్యక్షుడు, ఆ పార్టీ చావుని డివిజన్ అధ్యక్షుడు హయత్ హుస్సేన్ హబీబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన, కంటి వైద్య శిబిరాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను మోసగించిందన్నారు. తలసీమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏ ర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కా ర్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కో రుడు భూమేశ్, డివిజన్ల అధ్యక్షులు జగన్‌గుప్తా, కామేశ్, శ్రీనివాస్‌రెడ్డి, మారుతి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, లాయక్‌అలీ, శశిధర్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌కు తరలిన నేతలు..

సైదాబాద్: తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దీక్షాదివస్ వేడుకలకు సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీగా పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఠాకూర్, నందు, పరమేశ్, శ్రీకాంత్, రమేశ్, చంద్రశేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఐఎస్ సదన్ నుంచి..

యాకుత్‌పురా నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి, ఐఎస్‌సదన్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు తరలి వెళ్లారు.

బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణ..

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్ ఆర్‌కేపురం ఎన్టీఆర్ నగర్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సిద్ధగోని వెంకటేశ్‌గౌడ్, సాజీద్, బండారి మల్లేశ్, శేఖర్, రామాచారి, శ్రీనివాస్‌రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో..

ఎల్‌బీనగర్: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శంషాబాద్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షాదివస్‌కు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలివెళ్లారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..

నాగోలు: టీఆర్‌ఎస్‌వీ రంగారెడ్డి అధ్యక్షుడు పాండుగౌడ్, జిల్లా ఇన్‌చార్జి జహీర్ ఖాన్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయి, మహేశ్, అఖిల్, శ్రీనివాస్, భాస్కర్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ నేతలు..

మన్సూరాబాద్: మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి నేతృత్వంలో నేతలు శంషాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయానికి తరలివెళ్లారు.


కార్యకర్తలు, నాయకులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి




రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆజం అలీ, హుస్సేన్ హబీబ్


మోహన్‌నగర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న నాయకులు

రైతు బజార్‌ల్లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు. (కిలో. రూపాయల్లో) టమాట రూ. 40, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 28, కాకర 26, బీర 45, క్యాబేజి 26, ఫ్రెంచిబీన్స్ 35, క్యారట్ 40, దొండ 28, చిక్కుడు 28–50, గోకర 28, బీట్‌రూట్ 43, క్యాప్సికం 45, ఆలు 35, దోస 18, సొరకాయ 15, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 54, చామగడ్డ రూ. 35. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమల్లో ఉంటాయి.

వ్యక్తి అదృశ్యం

నాగోలు: వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసం ఉండే బంగ్లా ఖాజా (51) ఈ నెల 15న స్వగ్రామానికి వెళ్తానని చెప్పగా కుమారుడు నాగోలు బస్టాప్‌లో బస్సు ఎక్కించాడు. అదేరోజు రాత్రి కర్నూల్‌లో నివాసం ఉండే తన అమ్మ ఫాతిమాకు కుమారుడు ఫోన్ చేసి నాన్న ఇంటికి వచ్చాడా..? అని అడగగా రాలేదని చెప్పింది. దీంతో అప్పటి నుంచి కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం కుమారుడు షేక్ ఫారూక్ నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న విచారణ

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం ఇద్దరు అనుమానాస్పదంగా మృతి చెందారు. గుర్తు తెలియని విష పదార్థం తిని మృతి చెందినట్లు పోలీసులు భావించారు. దీంతో మద్యం, కల్లు తాగే అలవాటు ఉన్న వీరిద్దరు కల్తీ కల్లు తాగి మృతి చెందారా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట, దుర్గానగర్ వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన లక్ష్మయ్య కొడుకు వెంకటేశ్ (35) జీహెచ్‌ఎంసీలో చెత్త సేకరించే ఆటో కార్మికుడిగా పని చేస్తున్నాడు. మూసారంబాగ్ సంజీవయ్యనగర్‌కు చెందిన చిత్తరయ్య కుమారుడు నరేందర్ (45) కూలీ పని చేస్తున్నాడు. భార్యతో విడాకులు తీసుకున్నాడు. అన్న వదినతో కలిసి ఉంటున్నాడు. అయితే వీరిద్దరు స్నేహితులు కావడంతో కలిసి తిరుగుతూ మద్యం తాగే అలవాటు ఉంది. పోస్ట్ మార్టం నివేదిక వస్తే మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు పేర్కొంటున్నారు.

పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయండి

రామంతాపూర్ : పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ బండారు శ్రీవాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

వాటర్ లీకేజీలను అరికడతాం

మలక్‌పేట: వాటర్ లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని వాటర్ వర్క్స్ మలక్‌పేట డీజీఎం అస్మత్ అలీ అన్నారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ సహదేవ్ రెడ్డి స్వీట్ హౌజ్ ఎదుట ఎయిర్ వాల్వ్ లీకేజీ అయి తాగునీరు వృథాగా పారుతోంది. ఈ సమస్యను ‘సాక్షి’ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా శుక్రవారం డీజీఎం, మేనేజర్ ఎయిర్ వాల్వ్ వద్ద వాటర్ లీకేజీని పరిశీలించారు. ఆస్మాన్‌ఘడ్‌లోని రిజర్వాయర్ అధికారులకు విషయాన్ని తెలియజేసి మెయిన్ వాల్వ్ సప్లై నిలిపి వేయించారు. వాల్వ్‌కు మరమ్మతులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. డీజీఎంతో పాటు మూసారంబాగ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్, సిబ్బంది ఉన్నారు.



వాటర్ లీకేజీని పరిశీలిస్తున్న డీజీఎం అస్మత్ అలీ, మేనేజర్ వెంకటేశ్

రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తున్నదని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. బాటసింగారం పరిధిలోని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రుణ మాఫీ చేసి, సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో ఏవైనా సమస్యల వల్ల ఆగిపోయిన రుణ మాఫీని ఈ నెల 30 లోగా చేస్తామన్నారు. కోహెడ ప్రాంతంలో సుమారు రూ. 2 వేల కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని, త్వరలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన ఉంటుదని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఇన్ని కార్యక్రమాలు చేస్తుంటే ప్రతిపక్షాలు బురద రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరచారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డిం, గణేశ్ నాయక్, మధుసూదన్ రావు, నవరాజ్ గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం దోహదం


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: ఆరోగ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ తప్పకుండా వ్యాయామం చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సూచించారు. బండ్లగూడ రాజీవ్ స్వగృహ సహభవన టౌన్‌షిప్ సీ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపెన్ జిమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాస్ రావు, మునీందర్, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, విక్రంరెడ్డి, సరోజ, నరేశ్, నాగరాజు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్: పార్కుల్లో ఆహ్లాదంతో పాటు ప్రజలకు ఆరోగ్యం కూడా అందించాలనే ఉద్దేశంతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్ 1లోని పార్కులో ఓపెన్ జిమ్‌ను కాలనీవాసులు, జీహెచ్‌ఎంసీ ఈఈ ఆశాలత, డీఈ దామోదర్‌రావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, కాలనీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్, రవికుమార్, నర్సిరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.


ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: మరమ్మతుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీనివాసనగర్, శ్రీరామ్‌నగర్, తపోవన్, గ్రీన్‌పార్క్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌పై డ్రగ్స్ కంట్రోల్ అధికారుల దాడులు

మలక్‌పేట: మలక్‌పేట హైదరాబాద్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌పై దాడులు నిర్వహించినట్లు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు తెలిపారు. అధిక ధరలకు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించామని వారు పేర్కొన్నారు. అమ్మకాల బిల్లులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. విచారణ కొనసాగుతోందని వారు పేర్కొన్నారు.


అధిక ధరలకు విక్రయిస్తున్న మెడిసిన్ చూపిస్తున్న అధికారులు

ప్రసాద్ మృతి సీపీఐకి తీరని లోటు

నాగోలు: ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శి పోటు ప్రసాద్ మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బాతరాజు నరసింహ అధ్యక్షతన ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి, నాయకులు బోయపల్లి రాములు గౌడ్, కందుల సుధాకర్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాయకులు సక్రు నాయక్ ఏఐటీయూసీ మదిలేటి, నాయకులు లింగస్వామి, విక్రం, నర్సింగ్, అరుణ్ కుమార్ గౌడ్, వీరస్వామి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌బీనగర్‌లో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఒకే బైక్‌పై 55 చలాన్లు

నాగోలు: పిల్లి కిశోర్‌కు చెందిన (ఏపీ 07 ఏవై 9588) నంబర్ గల బైక్‌పై 8 నెలల వ్యవధిలోనే (55) చలాన్లు, రూ.11,605 వేల జరిమానా పెండింగ్ ఉంది. అయితే ఎల్‌బీనగర్ రింగ్ రోడ్‌లో నో పార్కింగ్ జోన్ వద్ద బైక్ నిలిపినట్లు గుర్తించిన ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం అక్కడికి చేరుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ అదనపు సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


బైక్‌పై ఉన్న పెండింగ్ చలాన్లు చూపిస్తున్న ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీసులు

విద్యార్థులకు చిత్ర లేఖనం, డ్రాయింగ్ పోటీలు


బహుమతులు అందుకున్న విద్యార్థులు

నాగోలు: డెలాయిటీ ఇంపాక్ట్ ఈవెంట్ డే యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆకృతి ప్రాజెక్టు సారథ్యంలో జైపురి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం డెలాయిట్ ఇంపాక్ట్ ఈవెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డెలాయిట్ సాఫ్ట్ వేర్ సంస్థకు చెందిన అభిషేక్ అగర్వాల్, బృందం సభ్యులు, ఉపాధ్యాయులు మేరీ బ్యుల, రమాదేవి, సుధారాణి, నాగమణి, ఆకృతి ప్రాజెక్టు ప్రతినిధి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 19వ డివిజన్ ఈస్ట్ బృందావన్ కాలనీకి చెందిన సిద్ధేశ్వర్ వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్‌ను చెక్కును శుక్రవారం కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి అభాగ్యులకు ఆపన్న హస్తంలాంటిందన్నారు. కార్యక్రమంలో 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ విశ్వనాథ్, నేతలు రవిగౌడ్, రాంచంద్రారెడ్డి కృష్ణ పాల్గొన్నారు.